

అక్రమ చెరువుల జాతర
పచ్చని పైర్లతో ధాన్యగారంగా పేరు పొందిన ముదినేపల్లి మండలాన్ని ఆక్వా చెరువులు ఆక్రమిస్తున్నాయి. 8లో



ట్రిపుల్ ఐటీకి పీయూసీ విద్యార్థులు
పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులు 2,030 మంది సోమవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చేరుకున్నారు. 8లో



సైబర్ మోసం.. సొమ్ము రికవరీ
జిల్లాకు చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసం వల్ల కోల్పోయిన మొత్తాన్ని పోలీసులు రికవరీ చేసి అందించారు. 8లో

మహమ్మారి మద్యం.. బతుకులు ఛిద్రం



వేల్పూరులోని మద్యం దుకాణం వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు (ఫైల్)

తెగ తాగించేస్తున్నారు
- మద్యం నుంచి సంపద సృష్టిలో కూటమి సర్కారు
- జిల్లాకు నెలవారీ టార్గెట్లు
- నెలకు రూ.175 కోట్ల మద్యం విక్రయించాల్సిందే..
- లక్ష్యం చేరేందుకు విచ్చలవిడిగా అమ్మకాలు
- మద్యం మత్తులో హత్యలు, దాడులకు తెగబడుతున్న మందుబాబులు

సాక్షి, భీమవరం: జిల్లాలో గీత కార్మికులకు చెందిన 18 షాపులతో కలిపి 193 మద్యం షాపులు ఉన్నాయి. నెలకు రూ.120 కోట్ల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని అంచనా. కాగా జిల్లాలో నెలకు రూ.175 కోట్ల వరకు మద్యం అమ్మకాలు చేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు రోజుకు సగటున రూ.6 కోట్లు వరకు మద్యం అమ్మకాలు చేయాల్సి ఉంది. లక్ష్యాన్ని చేరేందుకు నిబంధనల అమలులో అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా లిక్కర్ సిండికేట్లు ఎక్సైజ్ పాలసీని తుంగలోకి తొక్కుతున్నాయి. బెల్టు షాపులు, సిట్టింగ్ ఏర్పాట్లు, మంచింగ్ కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు అందుబాటులో ఉంచుతున్నారు. లూజ్ సేల్స్, నైట్ పాయింట్లు పేరిట వేళాపాలా లేకుండా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రైవేట్ పాలసీ వచ్చాక 25 శాతం మేర లిక్కర్, 80 శాతం మేర బీర్లు అమ్మకాలు పెరిగాయి. వీటిని మరింత పెంచుకునే పనిలో ఎక్సైజ్ శాఖ ఉంది.

శాంతిభద్రతలకు విఘాతం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఊరికి దూరంగా ఉన్న మద్యం దుకాణాలు.. కూటమి తెచ్చిన ప్రైవేట్ పాలసీతో జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లోకి వచ్చేశాయి. ప్రస్తుతం అమ్మకాలు పెంచుకునేందుకు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఏ టైం ఎక్కడపడితే మద్యం దొరికే పరిస్థితులు ఉన్నాయి. వేళాపాలా లేకుండా మందుబాబులు మత్తులో జోగుతూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఒక్కోసారి హత్యలకు సైతం దారితీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. జనావాసాల్లోని షాపుల వద్ద మందుబాబుల ఆగడాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.



జిల్లాలో జరిగిన సంఘటనలు
- మార్చి 19న తణుకు గణేష్‌చౌక్ ప్రాంతంలోని మద్యం షాపు నైట్ పాయింట్ వద్దకు అర్ధరాత్రి సమయంలో మద్యం కొనేందుకు వచ్చిన వ్యక్తికి సిబ్బందికి డిజిటల్ పేమెంట్ విషయమై వివాదం తలెత్తింది. సదరు వ్యక్తి ఇనుప రాడ్‌తో విచక్షణరహితంగా దాడి చేయడంతో సిబ్బంది ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- మార్చి 29న తణుకు రూరల్ వేల్పూరులోని మద్యం దుకాణం కాంపౌండ్‌లో అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి చెందడం వివాదస్పదంగా మారింది. అతడి ఒంటిపై గాయాలున్నాయని, మద్యం దుకాణం వద్ద ఎవరో కొట్టి హత్యచేశారని ఆరోపిస్తూ బంధువులు వైన్స్ షాపు వద్ద ఆందోళనకు దిగారు.
- మే 12న కాళ్ల మండలం ఎల్‌ఎన్ పురంలో చెరువుల వద్ద ఇద్దరు యువకులు కలిసి మద్యం సేవిస్తుండగా వివాదం తలెత్తింది. మద్యం మత్తులో ఒక యువకుడు మరో యువకుడిపై చాకుతో దాడిచేయగా తీవ్ర గాయాలతో మృతిచెందాడు.
- మే 27న రాత్రి సమయంలో భీమవరం రైల్వే ఫ్లై ఓవర్‌పై మద్యం మత్తులో ఓ యువతి రోడ్డుపై అడ్డంగా పడుకుని హల్‌చల్ చేసింది. అర గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.
- జూన్ 13న రాయలంకకు చెందిన వ్యక్తి మద్యం సేవించి కాళ్ల మండలం పెదఅమిరంలోని ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన రాయిపై పడిపోవడంతో గాయమై మృతి చెందాడు.
- జూన్ 15న ఓ డ్రైవర్ మద్యం మత్తులో కారు నడుపుతూ ముగ్గురిని ఢీకొట్టిన ఘటన ఆకివీడులోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.
- జూన్ 30న ఇరగవరం మండలం అర్జునుడుపాలెంలో మద్యం మత్తులో ఒక వ్యక్తి తన భార్య, కుమార్తెపై చాకుతో దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.
- జూలై 3న భీమవరం టూటౌన్ పరిధిలోని ఒక ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకుల మధ్య కోడిగుడ్డు విషయమై ఘర్షణ తలెత్తడంతో ఒక యువకుడు బ్లేడుతో మరో యువకుని గొంతు కోయడంతో తీవ్ర గాయాలయ్యాయి.
- జూలై 6న తాడేపల్లిగూడెంలోని భీమవరం బైపాస్ రోడ్డులోని మద్యం దుకాణం వద్ద కలిసి మద్యం సేవిస్తున్న ఇద్దరు కూలీల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఒకరు నాపరాయితో దాడి చేయడంతో మరో కూలీ మృతిచెందాడు.
- ఇవి జిల్లాలో చోటుచేసుకున్న ఘటనల్లో కొన్ని మాత్రమే. మద్యం మత్తులో జరిగిన రోడ్డు ప్రమాదాలు, వెలుగుచూడని, పోలీస్‌స్టేషన్ వరకూ చేరని ఘటనలు మరెన్నో.

గత ప్రభుత్వంలో పక్కాగా నిబంధనలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వ అధీనంలో ఉండటం వలన కచ్చితంగా నిబంధనలు అమలయ్యేవి. నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు జరిగేవి. షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకుపోవడమే తప్ప అక్కడే కూర్చుని తాగే వీలుండేది కాదు. బెల్టుషాపులకు ఆస్కారమే లేదు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారైందని ప్రజలు విమర్శిస్తున్నారు.

అమ్మకాలను కట్టడి చేయాలి



ఈ ప్రభుత్వం వచ్చాక మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. సమయపాలన లేకుండా ఎక్కడిపడితే అక్కడ మద్యం దొరుకుతుండటంతో క్రైం రేటు పెరుగుతోంది. జిల్లాలో లిక్కర్, బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మద్యం అమ్మకాల కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. – కర్రా జయసరిత, న్యాయవాది, పాలకొల్లు

న్యూస్‌రీల్

నిలకడగా వశిష్ట గోదావరి



నరసాపురం వలంధర్ రేవు వద్ద గోదావరి

పెనుగొండ: వశిష్ట గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన వరద సోమవారం స్థిరంగా ఉంది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి గోదావరి వరద తగ్గుముఖం పట్టిందని, ఇప్పట్లో పెరిగే అవకాశాలు లేవని అంచనా వేస్తున్నారు. లంక గ్రామాల్లోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై బురద చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నరసాపురంలో పెరుగుతూ..
నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా నీరు నదిలోకి వచ్చి చేరుతుండగా నీటిమట్టం పెరుగుతోంది. నీరంతా సముద్రంలోకి వెళుతుందని ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. సముద్రం పోటు సమయంలో మాత్రం నీటిమట్టం కాస్త పెరుగుతోంది. నరసాపురంలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు, మూడు రోజులపాటు నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది.

ఆఫ్‌లైన్ అడ్మిషన్లకు వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భీమవరం: డిగ్రీ అడ్మిషన్లను ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలంటూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భీమవరంలో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ మాట్లాడుతూ సాధారణ డిగ్రీ విద్యలో మార్పులు విద్యార్థులను గందరగోళంలోకి నెట్టుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్మిషన్లలో సింగిల్ మేజర్ విధానం ఇప్పటికే విఫలమైందని, ఈ విధానాన్ని కొనసాగించడం భావ్యం కాదన్నారు. డిగ్రీ విద్యలో డబుల్ మేజర్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల చాలా సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు బి.సింధు, ఎం.భాగ్యలక్ష్మి, పి.సాయికృష్ణ పాల్గొన్నారు.


కేసుల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన



భీమవరంలో అవగాహన ర్యాలీ

భీమవరం: కోర్టు కేసుల్లో మధ్యవర్తిత్వంపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించడానికి సోమవారం భీమవరంలో 1కే వాక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ వద్ద గల కోర్టు కాంప్లెక్స్ వరకు మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కక్షిదారులు సహృద్భావ వాతావరణంలో మధ్యవర్తిత్వం ద్వారా రాజీపడితే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కేసుల రాజీకి ప్రత్యేకంగా శిక్షణ పొందిన న్యాయవాదులను నియమించామని వారి సేవలు వినియోగించుకోవచ్చునన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, బెంచ్ మేజిస్ట్రేట్ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, డీఎన్నార్ లా కళాశాల ప్రిన్సిపల్ రఘురాం, న్యాయవాదులు, పారా లీగల వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న ఉద్యోగ మేళా



భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురం వైఎన్ కళాశాలలో ఈనెల 23న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ (ఉద్యోగ దిక్సూచీ) నిర్వహించనున్నట్లు జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుమారు 15 కంపెనీల్లో 700కు పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు సెల్ 94508 38388, 95020 24765 నంబర్లలో సంప్రదించాలని కోరారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నరసాపురం లేసుకు ఓడీఓపీ అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్) : న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నులు, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 'నరసాపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్'కు కేంద్ర మంత్రి పియూష్ గోయల్ చేతులమీదుగా కలెక్టర్ సీహెచ్ నాగరాణి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నరసాపురం లేసు అల్లికలకు గతేడాది జీఐ గుర్తింపు రావడం, ఇప్పుడు వన్ డిస్ట్రిక్ట్–వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కింద అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ గుర్తింపులతో వేలాది మంది నేత కార్మికులు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వగలుగుతామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో లేసు ఉత్పత్తులు గుర్తింపు పొందడంతో పాటు ఇప్పుడు ఈ అవార్డు అందుకోవడం లేసు తయారీదారుల కృషి ఫలితం అన్నారు. లేసు తయారీదారులకు కలెక్టర్ నాగరాణి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తంగా 12 ఫిర్యాదులు అందగా ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ మాట్లాడారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం



ఏలూరులో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ స్మార్ట్‌మీటర్ల నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సోమవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. స్మార్ట్‌మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయొద్దని నినదించారు. నాడు ప్రతిపక్ష నేతగా నారా లోకేష్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించారని.. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే కొనసాగించేలా చూస్తుండటం దారుణమన్నారు. సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, వైఎస్ కనకారావు, ఎం.ఇస్సాక్, పి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



భీమవరం కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..
- పాలకోడేరుకు చెందిన తొంట రాజమణి తనకు తల్లికి వందనం ఇప్పించాలని అర్జీ అందించారు.
- పెనుగొండ మండలం పితానివారిపాలేనికి చెందిన వేంద్ర మోహన్‌రావు అనారోగ్య కారణంతో కాలు తొలగించారని సామాజిక పింఛన్ సొమ్ము పెంచాలని కోరారు.
- ఆచంటకి చెందిన కె.సాల్మన్‌రాజు తన పాస్‌బుక్‌లో 27 సెంట్ల భూమి చూపుతుండగా సర్వేలో 25 సెంట్లు మాత్రమే ఉందని, మిగిలిన రెండు సెంట్లు అప్పగించాలని కోరారు.
- పాలకొల్లులోని 13వ వార్డుకు చెందిన వానపల్లి జేబీ రామ్ సిద్ధార్థ తనకు మానసిక వికలాంగుల పింఛన్ ఇప్పించాలని దరఖాస్తు అందించారు.

బెల్టుషాపులను ప్రోత్సహించడం సిగ్గుచేటు



మోకులతో గీత కార్మికుల నిరసనలు

బెల్టు షాపులను ప్రభుత్వమే ప్రోత్సహించడం సిగ్గుచేటని, గీత వృత్తిని కాపాడాలంటూ పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి , ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి డిమాండ్ చేశారు. భీమవరంలో కలెక్టరేట్ వద్ద కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'కలెక్టర్ గారికి చెప్పుకుందాం రండి' పేరుతో ధర్నా చేపట్టారు. గీత కార్మికులు మోకులతో వినూత్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుందని, ప్రభుత్వ విధానాలు, ఎక్సైజ్ పాలసీల వలన కల్లుగీత కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నరసింహమూర్తి మాట్లాడుతూ కల్తీ మద్యాన్ని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని, బెల్ట్‌షాపులు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఎక్సైజ్ అధికారుల సహకారంతో నడుస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్కా చంటి, సంఘ జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి పాల్గొన్నారు.

ఎస్టీ మహిళ రిజర్వేషన్ కొనసాగించాలి



కలెక్టరేట్‌కు వచ్చిన గిరిజన సంఘం నాయకులు

భీమవరం మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సంబంధించి ఎస్టీ మహిళ రిజర్వేషన్ కొనసాగించాలని ఎస్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భీమవరం ఏఎంసీ చైర్మన్ రిజర్వేషన్ మార్చడంపై సోమవారం కలెక్టరేట్‌కు ఎస్టీ సంఘాల నాయకులు సాలా శ్రీను ఆధ్వర్యంలో వచ్చి నిరసన తెలిపారు. అనంతరం జేసీకి వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎంబీసీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న మాట్లాడుతూ మొదటగా భీమవరం ఏఎంసీ చైర్మన్‌ను ఎస్టీ మహిళకు కేటాయించి తర్వాత ఓసీ మహిళగా మార్చడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వానికి ఎస్టీలపై ఉన చిన్నచూపునకు ఇది నిదర్శనమన్నారు. కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే పక్కన ఎస్టీ మహిళ చైర్మన్ హోదాలో కూర్చోవడానికి అర్హురాలు కాదా అని ప్రశ్నించారు. ఏఎంసీని ఎస్టీ మహిళకు కేటాయించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సాలా వెంకటేశ్వరరావు, కారంపూడి అనంతనాగు, నల్లగుంట ఏసు, బండి రాంబాబు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మూర్తి రాజు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

మండిపడ్డ ఉపాధ్యాయ సంఘాలు



యలమంచిలి మండలం ఏనుగువానిలంక హైస్కూల్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పాలకోడేరు: పాలకొల్లు మండలం అరట్లకట్ల హైస్కూల్ గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఆర్ మూర్తిరాజు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఫ్యాప్టో చైర్మన్ పీఎస్ విజయరామరాజు (యూటీఎఫ్) డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో సోమవారం మూర్తిరాజు మృతిచెందారని తెలిపారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇవ్వడంలో అధికారులు, ప్రభుత్వ వైఖరి మారని కారణంగానే హెచ్‌ఎం మూర్తిరాజు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకోడేరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు దూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ మోడ్ శిక్షణలను రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులు ఆరోగ్యపరమైన సమస్యలతో బాధపడుతుంటారని, అలాంటి వారిని రెసిడెన్షియల్ శిక్షణలకు దూరంగా ఉంచాలన్నా పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. ఒంటిద్దు పోకడలతో ప్రభుత్వం, అధికారులు పంతాలూ పట్టింపులకు పోతున్న ధోరణిలో ఉండటం వల్లే ఇలాంటి మరణాలు జరుగుతూనే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధోరణిని ఫ్యాప్టో పశ్చిమగోదావరి కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వర్క్‌కు సంబంధించిన బాధ్యతలు పెడుతూ ప్రతి విషయాన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయమనడం, వాటిలో ఉండే చిన్నపాటి లోపాలకు అధికారులు ఉపాధ్యాయులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. తద్వారా ఉపాధ్యాయులపై విపరీతమైన ఒత్తిడి పెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో ఫ్యాప్టో కోచైర్మన్ పి.సాయివర్మ (ఎస్టీయూ), ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ ప్రకాష్ (ఏపీటీఎఫ్), ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీ (ఏపీటీఎఫ్–1938) పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగోకపోయినా..
తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యం బాగోకపోయినా ట్రెనింగ్‌లు అంటూ జిల్లాస్థాయి అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరికాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల తీరును ఖండించారు. సోమవారం వారు తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌ఎం మూర్తిరాజు శిక్షణ కేంద్రంలోనే మరణించడం బాధాకరమైన విషయమన్నారు. హెచ్‌ఎం ఎస్‌వీఆర్ మూర్తిరాజు తాను అనారోగ్యంతో ఉన్నానని, ట్రైనింగ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా అధికారులను విజ్ఞప్తి చేసినా, తన తరపున తన అసిస్టెంట్‌ను పంపిస్తానని కోరినా జిల్లా అధికారులు మినహాయింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఒత్తిడితో ప్రధానోపాధ్యాయులకు ట్రెనింగ్‌లు నిర్వహించడం సరికాదని విమర్శించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన
యలమంచిలి: హెచ్‌ఎం మూర్తిరాజు మరణం బాధాకరమని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ అన్నారు. మూర్తిరాజు మృతికి సంతాపం తెలుపుతూ సోమవారం మండలంలోని ఏనుగువానిపాలెం హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ అధికారులు శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. దీనికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తి నాయుడు, గౌరవాధ్యక్షుడు వి.జగ్గారావు, కార్యదర్శులు బి.శైలజ, ముద్దల బాపిరాజు, మల్లుల శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త బెదిరిస్తున్నాడని ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం: తనపై పెట్టిన మనోవర్తి కేసు వెనక్కి తీసుకోవాలని భర్త బెదిరిస్తున్నట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన నన్నుబ్రోలు నాగదుర్గాప్రసాద్, సత్యతుల సిలకు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు ప్రస్తుతం విడిగా ఉంటున్నారు. సత్యతులసి భర్తపై మనోవర్తి కేసు పెట్టిందన్నారు. ఈ నెల 13న సత్య తులసి తన పిల్లలతో ఉన్న సమయంలో నాగదుర్గాప్రసాద్ మద్యం సేవించి ఇంటికి వచ్చి బూతులు తిడుతూ, కొడుతూ కేసు వెనక్కి తీసుకోవాలని దౌర్జన్యం చేశాడన్నారు. కేసు వెనక్కి తీసుకోకపోతే చంపుతానని బెదిరించాడని, దీంతో సోమవారం ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజిలెన్స్ తనిఖీలు



పురుగుమందుల షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలంలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపులను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ జి.మధుబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మండలంలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. తనిఖీల్లో భాగంగా చాముండేశ్వరి ఎంటర్‌ప్రైజెస్‌లో నిర్వహించిన తనిఖీల్లో వ్యత్యాసాలు గుర్తించామన్నారు. గడువు ముగిసిన పురుగుమందులు గుర్తించినట్లు చెప్పారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించకపోవడంతో సేల్స్ నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. తనిఖీల్లో సీఐ మధుబాబుతో పాటు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చేపల చెరువుల జాతర

- ముదినేపల్లి మండలంలో ఏడాదిలో 400 ఎకరాల్లో చెరువులు
- అమలుకాని అప్సడా నిబంధనలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు



ముదినేపల్లి మండలం దేవరంలో పొలాలు చెరువులుగా మారుస్తున్న పొక్లయిన్లు



వణుదుర్రులో చెరువుల తవ్వకం(ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పచ్చని పైర్లతో ధాన్యాగారంగా పేరుపొందిన ముదినేపల్లి మండలాన్ని ఆక్వా చెరువులు ఆక్రమిస్తున్నాయి. వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చాలంటే కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ కూటమి నేతల ముందు అవి పని చేయడం లేదు. కైకలూరు నియోజకవర్గంలో ప్రభుత్వానికి సమాంతర పాలన సాగుతోంది. ఆక్వా చెరువుల వల్ల తమకు నష్టం జరుగుతోందని గ్రామస్తులు రొడ్డెక్కుతున్నా అక్రమార్కుల కుట్రల ముందు ప్రజల వేదన అరణ్యరోదనగా మారుతోంది.

ఏడాదిలో 400 ఎకరాల్లో చెరువులు

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క ముదినేపల్లి మండలంలో దాదాపు 400 ఎకరాల్లో చేపల, రొయ్యల చెరువులను తవ్వేశారు. దేవరం గ్రామంలో ప్రస్తుతం 27 ఎకరాల విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వుతున్నారు. ఇదే మండలంలో పెదగొన్నూరులో 100, ఊటుకూరులో 100, వాడవల్లిలో 80, వణుదుర్రులో 70, దేవపూడిలో 40, పేరూరులో 10, గురజలో 10, వైవాకలో 6 ఎకరాల్లో చెరువులు తవ్వారు. కూటమిలో టీడీపీ, జనసేన నేతలు పోటాపోటీగా చెరువులు తవ్వేస్తున్నారు. ఓ సినీ నిర్మాతకు చెందిన చెరువు తవ్వకం ఇటీవల వివాదంగా మారింది. వణుదుర్రు గ్రామంలో ఆక్వా చెరువుల వల్ల తాగునీటి చెరువు కలుషితమవుతోందని గ్రామస్తులు ఆందోళన చేసినా ఫలితం కనిపించలేదు.

చట్టాలంటే లెక్కే లేదు

కూటమి నేతలు చట్టాలను లెక్క చేయడం లేదు. వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్పు చేయాలంటే మండల స్థాయి కమిటీ నుంచి జిల్లా స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు డీఎల్‌సీలో ఆమోదం తెలపాలి. ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా) నిబంధనలు పాటించాలి. మత్స్య శాఖ, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ, అగ్రికల్చర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలు పరిశీలన చేసి జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాలి. వరి పొలాలకు 3 మీటర్లు, తాగునీటి చెరువు, శ్మశానాలకు 10 మీటర్ల దూరంలో మాత్రమే చెరువు తవ్వాలి. ఇవేమి పాటించడం లేదు. దేవరంలో చేపల చెరువు తవ్వకాలపై గ్రామ వీఆర్వో ఏడుకొండలను వివరణ కోరగా మీరు ముదినేపల్లిలో బుజ్జిని కలవండని చెప్పడం విస్తుగొలిపింది. మత్స్యశాఖ అధికారి సతీష్‌కుమార్‌ను అడిగితే రెండేళ్ల క్రితం చెరువు తవ్వకాలకు దరఖాస్తు చేశారని, ఇప్పుడు అనుమతులు గురించి తెలీదని తప్పించుకున్నారు. ఈ విధంగా పలు శాఖల అధికారులు కూటమి నేతలకు భయపడి దాటవేత ధోరణి అనుసరిస్తున్నారు.

ఇది మా అడ్డా

కూటమి విజయంలో మా మండలం కీలకపాత్ర పోషించింది. ఇది మా అడ్డా అనే ధోరణి మండలంలో కనిపిస్తోంది. అక్రమ చెరువుల తవ్వకం, అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖలు అటుగా చూడడానికి జంకుతున్నారు. ఇక పేకాట సంగతి సరే సరి. చెరువు గట్లు పేకాట క్లబ్‌లుగా మారుతున్నాయి. సమీప గుడివాడ నుంచి పేకాటరాయుళ్లు ఈ మండలానికి వస్తున్నారు. ఈ మండలంలో పేరు మోసిన పేకాట నిర్వాహకుడు పలుమార్లు పోలీసుల చేతికి చిక్కినా.. రాజకీయ నాయకుల అండతో బయటపడుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో టీడీపీ నాయకుల పరిచయాలతో ఏదైనా చేయవచ్చనే ధోరణి ఈ మండలంలో స్పష్టంగా కనిపిస్తోంది.

వరిని మింగుతున్న చెరువులు

వరిని ఆక్వా చెరువులు మింగేస్తున్నాయి. పచ్చని పొలాలు చేపల, రొయ్యల చెరువుగా మారుతున్నాయి. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో వ్యవసాయ సాగు విస్తీర్ణం 22,493 ఎకరాల్లో ఉంది. మొత్తం 10,766 రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇక ఆక్వా చేపల, రొయ్యల విషయానికి వస్తే నాలుగు మండలాల్లో 84,755 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలో పూర్వం 25 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ సాగు ఉండేది. ఇప్పుడు 14,000 ఎకరాలకు పడిపోయింది. ముదినేపల్లి మండంలో విచ్చలవిడి చెరువుల తవ్వకాల వల్ల రానున్న రోజుల్లో వ్యవసాయం కనుమరగయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

వార్డు సచివాలయ కార్యాలయం మార్పు

సాక్షి ఎఫెక్ట్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీలోని సచివాలయం-5 కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉండటంతో కార్యాలయాన్ని స్థానిక వెలంపేట రామాలయం వద్దకు మార్పు చేసేందుకు చర్యలు చేపట్టామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి సోమవారం చెప్పారు. జాతీయరహదారికి చేర్చి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న నాలుగు అంతస్తుల భవనం కూలడానికి సిద్ధంగా ఉందని, దానిలో సచివాలయం, ప్రైవేటు విద్యా సంస్థను నడుపుతున్నారని సాక్షిలో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. భవన యజమానికి, విద్యా సంస్థ యజమాన్యానికి నోటీసులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. సచివాలయ కార్యాలయం మార్చి, మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమదుర్రు గ్రామానికి చెందిన తోలేరు సత్యనారాయణ (60) అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఆస్పత్రులు చుట్టూ తిరిగి ఎన్ని చికిత్సలు చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడటం లేదు. దీంతో ఆ బాధ తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సత్యనారాయణ కుమారుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి చోరీ

నరసాపురం రూరల్: మండలంలోని గొందిలోలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై టి.వెంకట సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీలబోయిన దేశింగరావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ నెల 12 ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి 13న ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి బీరువాలోని సుమారు రెండున్నర కాసులు బంగారం, 30 గ్రాముల వెండి, సుమారు రూ.5 వేల నగదు పట్టుకుపోయారు. చోరీ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై టీవీ సురేశ్ గ్రామానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. భీమవరం నుంచి క్లూస్ టీంను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళలకు రక్షణ కరువు



ఉప్పాల హారికపై దాడిని ఖండిస్తున్న మహిళా నాయకులు

కైకలూరు: కూటమి పాలనలో మహిళలకు పూర్తిగా రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీలు గంటా సంధ్య, కూసంపూడి కనకదుర్గారాణి మండిపడ్డారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై గుడివాడలో జరిగిన దాడిని ఖండిస్తూ కైకలూరు పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల్లో కూటమి పాలనలో మహిళలపై దాడులను జరగనివ్వమని పదేపదే వల్లించిన వాగ్దానాలు ఇప్పుడేమయ్యాయని? ప్రశ్నించారు. హోం మంత్రి అనిత సాటి మహిళగా ఇలాంటి దాడులను ఖండించాలన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలు రక్షణ కల్పించండని వేడుకున్నా పోలీసులు చోద్యం చూశారన్నారు. ముదినేపల్లి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు దున్నా బేబీ మాట్లాడుతూ మహిళలపై దాడులు పెరుగుతున్నా అదుపు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళా చైర్‌పర్సన్‌పై దాడి అమానుషమన్నారు. ముదినేపల్లి మండల వైస్ ఎంపీపీ రాచూరి రాధ, ఆటపాక 1, ఆడపాక 2 ఎంపీటీసీ సభ్యులు తమ్మిశెట్టి లక్ష్మీ, పట్టపు బాలమ్మ, మహిళా నాయకులు అర్జ విజయదుర్గ, మద్దా రాణి, ఆరేపల్లి శివ నాగలక్ష్మీ, తేరా జ్ఞానావతి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి చేరుకుంటున్న పీయూసీ-1 విద్యార్థులు



నూజివీడు ట్రిపుల్ ఐటీలోని కే4 హాస్టల్ వద్ద ఉన్న పీయూసీ 1 విద్యార్థులు



తమ పిల్లల బ్యాగులు మోసుకొస్తున్న తల్లిదండ్రులు

నూజివీడు: పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులు సోమవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చేరుకున్నారు. నూజివీడుతో పాటు ఒంగోలు, శ్రీకాకుళంకు సంబంధించిన పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2030 మంది తొలిరోజు నూజివీడు క్యాంపస్‌కు చేరుకున్నారు. విద్యార్థులతో పాటు వారి వెంట తల్లిదండ్రులు రావడంతో క్యాంపస్‌లో కోలాహలం నెలకొంది. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులు రాజేష్, దుర్గాభవానీలు, చీఫ్ వార్డన్‌లు సురేష్‌బాబు, గౌతమిలు కేర్‌టేకర్‌ల సహాయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా రూంలు కేటాయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బైక్ అదుపుతప్పి నేరుగా తూర్పులాకుల్లో పడడంతో యువకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని నవాబుపేట ప్రాంతానికి చెందిన అలికి కిరణ్(22) ఐటీఐ చదివి ఖాళీగా ఉన్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఆశ్రం ఆసుపత్రి వద్ద ఉన్న దాబాకు స్నేహితులతో కలిసి వెళ్ళాడు. అనంతరం అక్కడే ఉండి తిరిగి నవాబుపేటకు వస్తున్న సమయంలో తూర్పు లాకుల వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి లాకుల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో కిరణ్ పరిస్థితి విషమించి మృతి చెందాడు

కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామం రాపాక చానల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సోమవారం పంట కాలువలో సుమారు 45 నుండి 50 ఏళ్ల వయసు కలిగిన పురుషుడి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. ఒంటిపై నిక్కరు ఒక్కటే ఉన్నట్లు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం కాలువలోనే మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లిఫ్ట్ ఇచ్చి నిలువుదోపిడీ

దెందులూరు: ఒక యువకుడికి లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికిన ఇద్దరు గుర్తుతెలియని యువకులు, కొంత దూరం వెళ్ళాక ఆపి అతనిపై దాడి చేసి అతని వద్దనున్న బ్యాగ్, సెల్ ఫోన్, నగదును దోచుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఏలూరు రూరల్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలిదిండి మండలం చింతలమూరు గ్రామానికి చెందిన సదర్ల బ్రహ్మం హైదరాబాదులో ప్రైవేట్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామానికి వచ్చేందుకు ఆదివారం తెల్లవారుజామున ఏలూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులను లిఫ్ట్ అడిగాడు. వారు అతన్ని ఎక్కించుకొని రైల్వే స్టేషన్ నుంచి పోణంగి వైపు వెళ్లి అక్కడ బండి ఆపి కొట్టారు. అతని బ్యాగు, ఫోన్, రూ. 5500 నగదును అపహరించారు.బ్రహ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార యత్నం కేసులో అరెస్టు

ఉండి: ఈ నెల 13న ఉండి నక్కరాజుగుంటకు చెందిన యువతిపై పాములపర్రుకు చెందిన వర్రే రాజేష్ అత్యాచారయత్నానికి ప్రయత్నించినట్లు యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ మోసం కేసులో సొమ్ము రికవరీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాకు చెందిన ఒక వ్యక్తి సైబర్ మోసం వల్ల కోల్పోయిన మొత్తాన్ని పోలీసులు రికవరీ చేసి అతనికి అందించారు. కైకలూరు మండలం తామరకొల్లు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శ్రీనివాసరావు ఇటీవల తన సెల్‌ఫోన్‌కు వచ్చిన అనుమానాస్పద లింక్‌ను ఓపెన్ చేయగా అతని ఖాతా నుంచి మొత్తం రూ. 1.64 లక్షలను సైబర్ నేరగాళ్లు మోసపూరితంగా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన శ్రీనివాసరావు బ్యాంకు అధికారులను సంప్రదించాడు. అలాగే కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును పరిశీలించిన కైకలూరు టౌన్ పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగంతో కలిసి పనిచేసి బాధితుడి బ్యాంక్ ఖాతాలో పోగొట్టుకున్న మొత్తాన్ని సైబర్ నేరగాళ్ల నుంచి రికవరీ చేసి ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్ ద్వారా తిరిగి అందించేలా చర్యలు తీసుకున్నారు. బాధితుడు పోలీసు అధికారుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళు వివిధ రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పుడున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ద్వారా విదేశాలలో ఉన్న వ్యక్తులు కూడా తెలుగులో మాట్లాడగలుగుతున్నారని అలాంటి ఫోన్ కాల్స్‌ను నమ్మి వారు పంపించే యాప్‌లను గాని, లింకులు గానీ లేదా ఓటీపీలు గాని ఓపెన్ చేయకూడదని తెలిపారు.

బీడు వారిన భూములు



నీరులేక బీటలు వారిన నారుమళ్లు



నీటి కోసం రైతన్న ఎదురుచూపులు

- దెందులూరు నియోజకవర్గంలో నారుమళ్లకు అందని సాగు నీరు
- 450 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

దెందులూరు: దెందులూరు మండలంలో సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతున్నాయి. పోతునూరు, కేదవరం, గుండుగొలనుతో పాటు దెందులూరు శివారు ప్రాంతాల్లో 450 ఎకరాలకు పైగా పొలాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. గోదావరి కాలువకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఈ పరిస్థితి ఉండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఎవరికి చెప్పాలో తెలియక ఎప్పుడు నీళ్లు వస్తాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు. అందరూ సన్నా చిన్నకారు రైతులే. ప్రభుత్వం మాత్రం వందల ఎకరాల్లో సాగునీరు లేక పంట ఎండుతున్నా.. పట్టించుకోకపోవడంపై రైతులు, రైతు కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు కూడా కనీసం ఏం జరుగుతుందో.. పరిశీలన కూడా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ ఉద్యోగులు పట్టించుకోకపోతే జిల్లా అధికారులకు ఈ విషయం ఏం తెలుస్తుందని.. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో కూడా లేకపోతే తమ సమస్య ఎప్పటికీ పరిష్కారం అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తూర సైజు పెంచాలి



ఉండ్రాజవరం దగ్గర కొత్తచెరువు బోదీ వద్ద తూర పెంచాలి. తూర సైజు చిన్నగా ఉండటం వల్ల సాగునీటి సమస్య తలెత్తింది. సమస్య వెంటనే పరిష్కరించాలి.

–చెన్ను లక్ష్మణ, రైతు

50 ఎకరాల్లో సాగునీటి సమస్య



కేదవరం, పోతునూరు, గుండుగొలను గ్రామాల్లో 450 ఎకరాలకు సాగునీటి సమస్య ఉంది. రైతుల సమస్య పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎవరికి చెప్పాలో ఎవరు పరిష్కరిస్తారో అర్థం కావట్లేదు.

–మురల సత్యనారాయణ, రైతు

పట్టించుకోని అధికారులు



జిల్లా అధికారులు ఎప్పుడు వస్తారో.. సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో అర్థం కావడం లేదు. మూడు గ్రామాల్లో సాగునీరు లేకపోతే సమస్య కాదా.. మీరు పట్టించుకోరా?

–సరగల స్వామి, రైతు

ఆక్రమణకు గురైన వాగు



వాగును ఆక్రమించేశారు. పంట కాలువలు వెడల్పు చేయాలి. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సమష్టిగా పరిశీలించి ఆక్రమణలు తొలగించడానికి ఇబ్బంది ఏంటి?

–పదమట నాగేశ్వరరావు, రైతు

జగన్ రైతును రాజు చేశారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతును రాజుగా చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయం అనుసంధానం చేశారు. పంట పెట్టుబడి సాయం విధిగా అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీడు వారిన భూములకు సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

–డీబీఆర్‌కే చౌదరి ,వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి

ఎండుతున్న నారుమళ్లు



పోడూరు మండలంలో నీరులేక ఎండిపోతున్న నారుమడిని చూపుతున్న రైతు

భీమవరం: నీటిపారుదల శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సాగు నీరందక సార్వా నారుమళ్లు ఎండిపోతున్నాయని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్న అనంతరం భీమవరంలో విలేకర్లతో మాట్లాడారు. సాగునీటి సమస్యపై పోడూరు, ఆచంట, యలమంచిలి, పాలకోడేరు, అత్తిలి, వీరవాసరం మండలాల్లోని రైతులతో మాట్లాడినట్లు రామాంజనేయులు తెలిపారు. చెంతనే గోదావరి ఉన్నా సార్వా నారుమళ్లకు నీరందకపోవడంతో ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితి అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని సామెత చందాన గోదావరిలోని నీరు సముద్రంలోకి వెళ్తుంటే అనేక మండలాల్లో వేలాది ఎకరాలకు సాగు నీరందక నారుమళ్లు ఎండిపోయాయన్నారు. కొన్నిచోట్ల కనీసం దమ్ము చేసే అవకాశం లేదని కౌలురైతులు వాపోతున్నారన్నారు. ఇరిగేషన్ శాఖమంత్రి జిల్లాలోనే ఉన్నా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన నారుమళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాలువలు వదిలి రెండు నెలలైందని మరోపక్క గోదావరి ఉధృతంగా సముద్రంలోకి వెళ్తున్నా రైతులకు సాగునీటి కష్టాలేంటని ప్రశ్నించారు. కాలువలకు లెవల్ పెంచి పూర్తి స్థాయిలో సాగునీరు ఇవ్వాలని, తక్షణం చించినాడ, కవిటం, దేవ, చినమల్లం బ్యాంక్ కెనాల్, మొగల్లు పంట కాలువలకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు మాధవరంలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ సమావేశానికి విచ్చేస్తారని, పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అభయ గణపతికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆషాఢ బహుళ చవితి (సంకటహర చతుర్థి) పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కొలువై ఉన్న శ్రీ అభయ గణపతికి సోమవారం ఏకాదశ అభిషేకాలు, పంచామృతాలతో, వివిధ ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో, శ్వేతార్క పుష్పాలు, దుర్వాంకురాలతో ఆలయ అర్చకులు ఇవటూరి శశికాంత్ శర్మచే విశేష పూజలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం



కుముదవల్లి గ్రంథాలయంలో అల్లూరి స్మారక చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరు: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కందుకూరి వీరేశలింగ కవి సమాజ గ్రంథాలయ చైర్మన్ భూపతిరాజు శ్రీనివాసరాజు అన్నారు. కుముదవల్లి గ్రామంలోని గ్రంథాలయానికి సోమవారం మోగల్లు అల్లూరి స్మారక సంస్థ సౌజన్యంతో అల్లూరి చిత్రపటాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ తెలుగు జాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచిన అల్లూరి పోరాట స్ఫూర్తిని, అణగారిన వర్గాలకు అండగా నిలిచే తత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రంథాలయ కార్యదర్శి నాగేంద్ర వర్మ, పాలకోడేరు మండల బీజేపీ అధ్యక్షుడు బుద్ధరాజు బలరామరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మోగల్లు అల్లూరి స్మారక సంస్థ సభ్యులు 37 స్కూల్స్, గ్రంథాలయాల్లో అల్లూరి చిత్రపటాలను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జీవరత్నం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావిపాడులో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 9 ఎకరాల గడ్డి వాము దగ్ధం కాగా, సమీపంలో పశువుల పాకకు మంటలు వ్యాపించాయి. పాడి గేదెలలో ఒక గేదెకు గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అనంత పద్మనాభంకు చెందిన పశువుల పాక, గడ్డి మేటు దగ్ధం అయ్యాయి. సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా సకాలంలో గూడెం అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇంకా తెలియరాలేదు.

19, 20 తేదీల్లో సీపీఐ 27వ జిల్లా మహాసభలు

తణుకు అర్బన్: సీపీఐ జిల్లా సమితి 27వ మహాసభలు ఆగస్టు 19, 20 తేదీల్లో తణుకులో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చెప్పారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన సీపీఐ తణుకు పట్టణ సమితి సమావేశం నిర్వహించారు. ఆగస్టు 7,8 తేదీల్లో తణుకులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యాన్ ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

పాలకోడేరు: వ్యాన్ ఢీకొట్టడంతో మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం కాశీపాడుకు చెందిన ఇసుకపాటి సువర్ణరాజు సోమవారం ప్రార్థనలకు వెళ్ళి తిరిగి ఇంటికి బైక్‌పై వెళ్తుండగా గరగపర్రులోని పెట్రోల్ బంకు దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. భార్య రత్నకుమారి 108 అంబులెన్స్‌లో సువర్ణరాజుని భీమవరం హాస్పిటల్‌కు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తారెత్తిస్తున్న ఎండలు

- మరో నాలుగు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు



ప్రత్తిపాడు వద్ద జాతీయరహదారిపై ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

పెంటపాడు: పట్టణ ప్రజలను ఎండలు తారెత్తిస్తున్నాయి. వేసవికాలం ముగిసిపోయి, రుతుపవనాలు దేశంలోకి, రాష్ట్రంలోకి వచ్చి నెల రోజులు దాటేస్తోంది. వర్షాకాలం ప్రవేశించి దాదాపు నెల రోజులు కావస్తున్నా నగరంలో పెద్దగా వానలు పడిన దాఖలాలు. అడపాదడపా వానలు పడినా వర్షాకాలం ప్రభావం కనిపించలేదు. ఈ నెల కాలంలో పట్టణంలో వేళ్లపై లెక్కించదగినన్ని రోజులు మాత్రమే వానలు కురిసి మమ అనిపించాయి. అయితే ఉష్ణోగ్రతలు వేసవిని తలిపించేలా నమోదవుతున్నాయి.

ఉక్కిరిబిక్కిరి

ఒక పక్క గత వారం రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతుండగా, మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వేసవి కాలం ముగిసిన తరువాత గత వారం రోజులుగా నగరంలో 34 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. శనివారం 36 డిగ్రీలు నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. అయితే ఆది, సోమవారాల్లో కూడా 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని, మంగళ, బుధవారాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీంతో ఇప్పుడప్పుడే వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడంలేదనే భావన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

పట్టణంలో విచిత్ర వాతావరణం

పట్టణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండలు కాస్తుండగా సాయంత్రం వాతావరణంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణాన అయినా కుండపోత వర్షం కురుస్తుందన్నట్టుగా దట్టమైన మబ్బులు పట్టడం కొంతసేపటికి పెద్ద ఎత్తున గాలి వీచి మబ్బులు తరలి వెళ్లిపోవడం ప్రజలు ఉసూరుమనడం గత కొన్ని రోజులుగా జరిగిపోతుంది. శనివారం ఉదయం భారీ వర్షం కురిసి రోడ్లన్నీ నీటితో మునిగిపోయాయి. ఉదయం 8 గంటలకే భానుడు భగభగలాడుతూ దర్శనమిచ్చాడు. సాయంత్రం 6.30 గంటల వరకూ నగరంపై భానుడి ప్రతాపం కొనసాగింది. 6.30 గంటల తరువాత సూర్యుడు శాంతించినా వాతావరణంలో వేడి మాత్రం తగ్గలేదు. మధ్యాహ్నం ఎండ దాదాపు వేసవి వాతావరణాన్ని తలపించింది. మహిళలు తలపై కొంగులు, గొడుగులు కప్పుకుని రాకపోకలు సాగించారు. తప్పని పనులపై బయటకు వచ్చిన పురుషులు సైతం తొందరగా ఇళ్లకు చేరుకోవడానికి ప్రయత్నించారు. సోమవారం కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పెద్దగా జన సంచారం లేకపోవడం, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా తాడేపల్లిగూడెం పట్టణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండడంతో మరోసారి వేసవి వచ్చిందని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా వేసవి కాలం నాలుగు నెలలు, వర్షాకాలం నాలుగు నెలలు, శీతాకాలం నాలుగు నెలలు ఉంటుంది. అయితే ఈ ఏడాది వానాకాలం నెల రోజుల్లోనే వెళ్లిపోయిందా అనే అనుమానాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వానా కాలం వచ్చినా ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగంలో ఎటువంటి మార్పు రాలేదని, కూలింగ్ వాటర్ కోసం వెంపర్లాడాల్సి వస్తుందని, కాసేపు బయటకు వెళితే ఎండ దెబ్బకు ఎప్పుడు ఏసీలోకి వెళదామా అనే ఆలోచన వస్తోందంటున్నారు. జ్యూస్‌లు, కూల్ డ్రింకులు, ఐస్‌క్రీంలు వంటి పదార్థాలు, పానీయాల విక్రయాలు సైతం వేసవి మాదిరిగానే ఉన్నట్టు చెబుతున్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శలు



ఏలేటిపాడులో వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. ఏలేటిపాడులో తణుకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పులగం సూర్యనారాయణ రెడ్డి తాతయ్య, నాయనమ్మ పులగం వీరారెడ్డి, సుబద్రమ్మ దంపతులు ఇటీవలే మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చోడే జోషి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరగవరం గ్రామానికి చెందిన మంగెన రామయ్య సతీమణి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. రేలంగి గ్రామం వైఎస్సార్‌సీపీ నాయకులు నడుంపల్లి రామరాజు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స రాంభద్ర రాజు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం
- 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి



తేతలిలో వృద్ధురాలికి కూటమి ప్రభుత్వ మోసం గురించి వివరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అన్నదాత సుఖీభవ ఇస్తామని రైతుల్ని, ఆడబిడ్డ నిధి ఇస్తామని మహిళల్ని, 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని బీసీ వర్గాలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు మండలంలోని తేతలి గ్రామం, పైడిపర్రులో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు ఇష్టానుసారంగా హామీలు గుప్పించి ప్రజల్ని నిట్టనిలువునా వంచించారని మండిపడ్డారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఏ గుమ్మంలోకి వెళ్లినా చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పాటు 175 హామీలు గుప్పించి ఇప్పుడు మాకు సినిమా చూపిస్తున్నాడని శాపనార్థాలు పెడుతున్నారన్నారు. పింఛన్ వెయ్యి పెంపు, అరకొరగా తల్లికి వందనం, ఉచిత సిలిండర్ తప్ప ఏఒక్క పథకం కూడా అమలు చేయకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేశాడని, కూటమి ప్రభుత్వం రాగానే సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రతి మంగళవారం అప్పులు చేస్తూ అమరావతికి దారపోస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నేతలు అందినకాడికి గాదికాడ పందికొక్కులా దోచుకుని దాచుకుంటున్నారని విమర్శించారు. జగన్ ఇచ్చిన పథకాలన్నీ నిలిపివేసి ఇస్తామన్న పథకాలు ఇవ్వకపోవడంతో పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజానీకం అల్లాడుతున్నారని, నగదు చలామణి జరగక వ్యాపారాలు లేక వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఇటువంటి గడ్డుకాలం జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎన్నడూ లేదని ఇదే విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు తెలిపే విధంగా ఉన్న క్యూఆర్ కోడ్ కరపత్రాలను కారుమూరి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, సరెళ్ల వీరతాత, దారం శ్రీను, మానేపల్లి సంపతరావు, వీరవల్లి సత్యనారాయణ, గారపాటి బాబూరావు, వందే చంద్రశేఖర్, గెడ్డం శేఖర్, గూట్ల ధనరాజు, నిమ్మకాయల రామకృష్ణ, పైడిపర్రులో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో జిల్లా సెక్రటేరియట్ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి బలరామకృష్ణ, పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు, పట్టణ మహిళా ధ్యక్షురాలు నూకల కనకదుర్గ, షేక్ ఫహీమా, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.

ఏలూరుపాడులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



ఏలూరుపాడులో పర్యటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం

కాళ్ల: ఏలూరుపాడులో స్వచ్ఛసర్వేక్షణ్ కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. ఈసందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, మురుగునీటి పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో పలు గృహాలను పరిశీలించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో కూరగాయల పండ్ల పెంపకం వంటి అంశాలపై సర్వే చేశారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను పరిశీలించారు. సర్పంచ్ బీహెచ్ జగ్గరాజు, స్వచ్ఛ సర్వేక్షన్ బృంద సభ్యులు టీవీ రవికిరణ్, ఎం.సంతోష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎంవీ.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఫణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మితే కఠిన చర్యలు



కల్లు విక్రయ దారులతో ఎక్సైజ్ సిబ్బంది

తాడేపల్లిగూడెం : కల్తీ కల్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్చరించారు. తెలంగాణా రాష్ట్రంలో కల్తీకల్లు తాగి అనేకమంది అస్వస్థులయ్యారని, ఈ నేపథ్యంలో ఇక్కడ విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్తు కలగడానికి ఏ విధమైన రసాయనాలు కలపవద్దన్నారు. అమ్మకాల్లో పారదర్శకంగా ఉండాలన్నారు. కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు చేసి, నమూనాలు సేకరించి ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. 27 సహకార కల్లు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబు అంటేనే మోసం



అత్తిలిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక విస్మరించడంతో ప్రజలు చీదరించుకుంటున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి అత్తిలి మండలం పాలూరు, అత్తిలి శివారు బొంతువారి పాలెం గ్రామాల్లో పర్యటించి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ప్రజలు ఎంత మోసానికి గురైరో వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి ఏఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, మహ్మద్ అబీబుద్దీన్, తానుకొండ దయామణి, రాపేటి సింహాచలం, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రోడ్లు.. ప్రమాదాలకు దారులు



తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంట - దండగర్ర రహదారిపై బేబి చిప్స్ పైకి లేచిన దృశ్యం



తాడేపల్లిగూడెం పట్టణశివారు కొండాలమ్మ గుడి నుంచి అప్పారావుపేట వెళ్లే రహదారిపై ప్యాచ్ వర్కుల్లోని బేబి చిప్స్ పైకి లేచిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలోని పలు రహదారులు ఛిద్రమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో గుంతలు ఉన్న రహదారులపై కూటమి ప్రభుత్వం ప్యాచ్ వర్కులు చేసింది. అయితే, గత పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు ప్యాచ్ వర్కులు పాడై ప్రస్తుతం కాస్తున్న ఎండలకు బేబి చిప్స్ పైకి లేచి ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్రవాహనాలు ఈ బేబి చిప్స్‌పై జారుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా పట్టణ శివారు కొండాలమ్మ గుడి మోదుగ గుంటవరకు, దండగర్ర - ఇటుకులగుంట, ఎల్.అగ్రహారం - పుల్లాయగూడెం, చినతాడేపల్లి - వీరంపాలెం తదితర రహదారులపై ఈ పరిస్థితి నెలకొంది. ప్యాచ్ వర్కులు చేసిన అనతికాలంలోనే రహదారులు అధ్వానంగా తయారు కావడంపై ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులపై ఏమాత్రం ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా, అధికారులు శాశ్వత ప్రాతిపదికన రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి



పుల్లాయగూడెం రహదారి పాడైంది. బేబి చిప్స్ పైకి లేవడంతో వాహనాలు జారిపడుతున్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే భయమేస్తుంది. రాత్రి సమయాల్లో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. వీటితో పాటు మండలంలోని పలు రహదారులు సైతం ఇదే పరిస్థితి నెలకొంది. వెంటనే ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

– మార్లపూడి సుబ్బారావు, ఎమ్పీటీసీ, తాడేపల్లిగూడెం మండలం

వెల్ఫేర్ బోర్డు పనితీరును మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం రూరల్: వెల్ఫేర్ బోర్డు పనితీరును మెరుగుపర్చి పటిష్టం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం గంధం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ చేసిన పోరాటాలు ఫలితంగా వెల్ఫేర్‌బోర్డుకు చైర్మన్‌ను నియమించడంతో పాటు కార్యకలాపాలను వేగవంతం చేసిందన్నారు. కొత్త సభ్యుల నమోదు అవకాశాన్ని గ్రామ సచివాలయాలకు కల్పించాలని కోరారు. జిల్లా భవన నినర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఏఐటీయూసీ ఏరియా కమిటి కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడారు. సంఘ కార్యదర్శి తాతకుంట్ల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిపాలూరి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కంకిపాటి రాజు, ఏరియా కమిటి సభ్యులు గోపిరెడ్డి నాగచంద్రరావు, రుద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



సత్యసాయి యోగా మండలి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పలువురు వక్తలు తెలిపారు. అమలాపురం రోటరీ క్లబ్‌లో ఇటీవల యోగాంధ్రా రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తాడేపల్లిగూడెంనకు చెందిన సత్యసాయి యోగా మండలి నుంచి వెళ్లిన యోగా సాధకులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహిళా విభాగంలో ఎ.ఉషశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి, బాలుర విభాగంలో పాలూరి చిరంజీవి ప్రథమ స్థానం, బాలికల విభాగంలో యర్రంశెట్టి తేజస్వి, పాలూరి అభినందనలు నాలుగు, ఐదో స్థానాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 9, 10వ తేదీలలో జరిగే జాతీయ స్థాయి సౌత్ ఇండియన్ పోటీలకు అర్హత సాధించారు. ప్రజా ప్రతినిధులు, యోగా గురువులు అభినందించారు.

మానవత సేవలు అభినందనీయం



మానవత సంస్థకు చెక్కు అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం గ్రామ పెద్ద గారపాటి వైకుంఠం ఫ్రీజర్ బాక్స్ నిమిత్తం రూ. 75 వేలు చెక్కును అందజేశారు. మానవత సేవా సంస్థ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు జి.రాజేంద్ర కుమార్, యోగ్గిన శరత్ బాబు, పచ్చ వెంకటేశ్వరరావు, చేకూరి బంగ్రారాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తణుకు అర్బన్: చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. కామర్స్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్(సీఈటీ) సబ్జెక్టులు బోధించడానికి సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఈ నెల 17లోగా దరఖాస్తులు స్వీకరించి 19న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకులకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.